ఆర్యవైశ్యులు బీజేపీకి అండగా నిలవాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలవాలని కేంద్రమంత్రి, బీజేపీ సికింద్రాబాద్ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి కోరారు. అన్నివర్గాల ప్రజల అండతో సికింద్రాబాద్‌లో కమలం జెండా ఎగురవేసి తీరుతామని ఆయన ధీమా వ్యక్తంచేశారు. ఆదివారం బర్కత్‌పురలో బీజేపీ నగర కార్యాలయంలో ఆర్యవైశ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. యువత, మేధావులు, విద్యావంతులు మోదీ మూడోసారి ప్రధాని కావాలని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ముఖ్యంగా అపార్ట్‌మెంట్‌వాసులు, కాలనీవాసులు ఓటింగ్‌లో పాల్గొనే విధంగా అవగాహన పెంపొందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, నాయకులు చికోటి ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశభద్రత, అభివృద్ధికి మోదీ నాయకత్వాన్ని బలపరచాలి

● ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్



పాలమూరు బస్తీలో ప్రచారం చేస్తున్న డాక్టర్ లక్ష్మణ్, కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దేశభద్రత, అభివృద్ధి కోసం బీజేపీకి ఓటు వేసి ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరచాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్. కె. లక్ష్మణ్ ప్రజలను కోరారు. ఆదివారం రాంనగర్ డివిజన్‌లో బాగ్‌లింగంపల్లి, పాలమూరు బస్తీ, న్యూఅచ్చయ్యనగర్, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, ఆజామాబాద్ తదితర ప్రాంతాలలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పదేళ్ల పాలనలో మోదీ చేసిన అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించి కమలం గుర్తుకు ఓటువేయాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలలో ఒక్కటి కూడా సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మురిగిపోతుందన్నారు. రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రామ్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు కలకోట అరుణ్ పాల్గొన్నారు.

ఎంపీగా గెలిపించండి.. అందుబాటులో ఉంటా

● దానం నాగేందర్



ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తున్న దానం నాగేందర్

అంబర్‌పేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఆదివారం ముత్యాలమ్మ దేవాలయంలో బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. తనను ఎంపీగా గెలిపిస్తే అంబర్‌పేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలు పరిష్కరించడమే తన లక్ష్యమని, వారికి నిత్యం అందుబాటులో ఉంటానని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజలు వినియోగించుకుంటున్నారని, ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తారనే నమ్మకం తనకు ఉందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గెలిపించాలని దానం కోరారు.

దానం గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలి

ఎర్రగడ్డ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించడానికి పార్టీ అనుబంధ కమిటీలు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి, ఎర్రగడ్డ అధ్యక్షులు దూడల రవి గౌడ్ అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్ కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారం ముమ్మరం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మూడు నెలల్లో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఎర్రగడ్డ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎర్ర కృష్ణకుమార్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదం, ఏలేశ్వరావు, నాగేందర్, డాక్టర్ లహర్ గాంధీ, రమేష్ నాయక్, దేవా, యాకమ్మ పాల్గొన్నారు.



ఎర్రగడ్డ డివిజన్ సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్



విజేతలకు బహుమతులు అందజేసిన శ్రీనివాస్‌రెడ్డి

నాయిని స్మారక క్రికెట్ పోటీలు

రాంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా మాజీ హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి పనిచేశారని వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నాయిని నర్సింహారెడ్డి జయంతి సందర్భంగా ఆదివారం బాగ్‌లింగంపల్లిలో సరోజిని మైదానంలో వీఎస్టీ కార్మికులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో నాలుగు టీమ్‌లు పాల్గొన్నాయి. షిఫ్ట్ నంబర్ 3 ప్రథమ విజేతగా, రన్నర్‌ఎగా కామన్ షిఫ్ట్ టీమ్ గెలిచింది. విజేతలకు వి. శ్రీనివాస్‌రెడ్డి షీల్డ్‌లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఐలి ప్రభాకర్, నాయకులు బాబీ, నరేందర్‌గౌడ్, రవియాదవ్, రణదీర్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



పోచమ్మ ఆలయ ముఖద్వారం ప్రారంభించి, పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం నల్లకుంట డివిజన్ న్యూఇందిరానగర్‌లో పోచమ్మ ఆలయ నూతన ముఖద్వారం(కమాన్)ను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి. శంకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్య పెడుతున్న రాజకీయ పార్టీలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ భీమేశ్వర్

రాంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు అమలుకాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెడుతున్నాయని బిట్స్ పిలాని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ. భీమేశ్వర్, సీసీఎంబీ రీసెర్చ్ స్కాలర్ ఆదిత్య ఉండ్రు ఆరోపించారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక నగర 18వ మహాసభలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్ కేటాయింపుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాలను విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం లేదన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, నాయకులు ప్రొఫెసర్ ఎ. రామచంద్రయ్య, ఆనంద్‌కుమార్, రాజా, మోహన్, జగన్మోహన్‌రావు, మమత, విజయలక్ష్మి, రజని తదితరులు పాల్గొన్నారు.

కొత్త సాంస్కృతిక సంస్థలు ఆవిర్భవించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొత్త సాంస్కృతిక సంస్థలు ఆవిర్భవించాలని ఎస్‌బీఐ రిటైర్డ్ ఏజీఎం సీహెచ్ త్రినాథరావు అన్నారు. త్యాగరాయగాన సభలో ఆదివారం ప్రముఖ గాయకుడు శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో జయకృష్ణ ఆర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ఆవిర్భావ సభ జరిగింది. సంస్థ లోగోను ఆవిష్కరించిన త్రినాథరావు మాట్లాడుతూ.. కొత్త సంస్థలు ఆవిర్భవించడం వల్ల నూతన గాయనీగాయకులకు అవకాశాలు వస్తాయన్నారు. శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులు జయలక్ష్మి, కృష్ణరావును స్మరించుకుంటూ సోదరుల ప్రోత్సాహంతో సంస్థను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గాయకులు గీతాలు ఆలపించారు.



జయకృష్ణ ఆర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న త్రినాథరావు, శ్రీనివాస్‌నాయుడు తదితరులు

ఎంపీగా అవకాశం కల్పించండి

పద్మారావుగౌడ్



పద్మారావుగౌడ్‌కు హారతి ఇస్తున్న మహిళ

బౌద్ధనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సభ్యుడిగా తనకు అవకాశం కల్పించాలని, ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ కోరారు. ఆదివారం సాయంత్రం సీతాఫల్‌మండి డివిజన్‌లో చిలకలగూడ, కిందిబస్తీ, మహ్మద్‌గూడ, షాబాద్‌గూడ, వారాసిగూడ, నామాలగుండు తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజుసాగర్, యువనేత రామేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీవి మోసపూరిత వాగ్దానాలు

రాంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఆదివారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద వాకర్స్‌ను కలిసి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత వాగ్దానాలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కవాడిగూడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఆదివారం కొత్తబజార్, కామునికంత, కిందిబస్తీ, ఎల్‌బీనగర్, కోదండరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మహేందర్‌రెడ్డిని కలిసిన రైల్వే సర్వీస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కాంగ్రెస్‌కు రైల్వే సర్వీస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ మద్దతు

బర్కత్‌పుర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని రైల్వే సర్వీస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, కోశాధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సునీత, ఆమె భర్త మహేందర్‌రెడ్డిని కలిసి మద్దతు తెలిపినట్లు చెప్పారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 17 ఎంపీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కృష్ణ, మధు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతికి శతకలశాభిషేకం

చిక్కడపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సంకటహర చతుర్థి సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో ఆదివారం శతకలశాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు.

ఆత్మరక్షణకు 'తైక్వాండో' దోహదం

● ఎమ్మెల్యే ముఠాగోపాల్



సెయింట్ పాయిస్ స్కూల్‌లో తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు 'తైక్వాండో' దోహదపడుతుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం రాంనగర్ సెయింట్‌పాయిస్ స్కూల్‌లో ఇంటర్ స్కూల్ గ్రేటర్ హైదరాబాద్ తైక్వాండో ఓపెన్ చాంపియన్‌షిప్ సబ్ జూనియర్, సీనియర్ బాయిస్ అండ్ గర్ల్స్ పోటీలను సంస్థ కార్యదర్శి బి. కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. తైక్వాండో, కరాటే నేర్చుకునేందుకు మహిళలు దృష్టి సారించాలని సూచించారు. పోటీల్లో 300కు పైగా బాలబాలికలు పాల్గొన్నారు. విజేతలకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ బి. శంకర్‌లూక్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, సంస్థ జనరల్ సెక్రటరీ మీర్ హజ్ అలీఖాన్, థైక్వాండో మాస్టర్ సుబ్రహ్మణ్యం, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, టి. సోమన్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం'

రాంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మతపరమైన రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీలను అన్ని రంగాల్లో అణచివేస్తోందని, బీసీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్. కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేటలో జరిగిన గౌడ కులస్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జనాభాలో సగభాగమైన బీసీల కులవృత్తులను బీజేపీ అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ వారిని అభివృద్ధి వైపు తీసుకొస్తుందన్నారు. దేశంలోని అత్యున్నతమైన ప్రధాని పదవిని బీసీ సామాజిక వర్గానికి చెందిన మోదీకి ఇవ్వడం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా 117 మంది బీసీలకు బీజేపీ ఎంపీ టికెట్లు ఇచ్చి పెద్దపీట వేసిందన్నారు. ముగ్గురు బీసీలకు సీఎం పదవి కల్పించిందన్నారు. రాష్ట్రంలో ఐదుగురికి ఎంపీ టికెట్లు ఇచ్చిందని తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి బీసీలంతా ఓట్లు వేయాలని కోరారు. జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గౌడ కులస్థుల సంక్షేమం, అభివృద్ధి కోసం బీజేపీ నిరంతరం పోరాడుతోందన్నారు. కల్లు గీత వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సహకారం అందిస్తానన్నారు. రెండోసారి తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో చేర్చొద్దు



అభివాదం చేస్తున్న ప్రదేశ్ గంగపుత్ర సంఘం, బీసీ-ఏ కుల సంఘాల నాయకులు

పంజాగుట్ట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ సామజిక వర్గాన్ని బీసీ-ఏ జాబితాలో చేర్చొద్దని ప్రదేశ్ గంగపుత్ర సంఘం, బీసీ-ఏ కుల సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, నగర అధ్యక్షుడు చాట్ల సదానంద్, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ బాగయ్య, బీసీ-ఏ కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు ఎం.ఎస్ నరహరి తదితరులు మాట్లాడారు.

ఈ నెల 14న నారాయణపేట్‌లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీసీ-డి గ్రూపులో ఉన్న ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో కలుపుతామని అనడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేస్తామని హెచ్చరించారు. జనాభాలో 10 శాతం ఉన్న వారిని ఏ శాస్త్రీయ పద్ధతి లేకుండా 18 శాతం ఉన్న 57 కులాలలో కలపడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. త్వరలో సీఎంను కలిసి వాస్తవాలను వివరిస్తామని వారు తెలిపారు. సమావేశంలో బీసీ-ఏ కుల సంఘాల నాయకులు డాక్టర్ బి.లక్ష్మయ్య, బాలరాజు, ముత్యాల నర్సింహులు, జి.శివరత్నం, పిల్లి శంకర్, ఓం ప్రకాష్, ఉసా నర్సింహ బెస్త, మల్లేష్, స్వర్ణలత, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మే 1 నుంచి రాజ్యాంగంపై అవగాహన శిబిరాలు

బర్కత్‌పుర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించడానికి మే 1 నుంచి 24వ తేదీ వరకు శిబిరాలను నిర్వహిస్తున్నామని దక్షిణ భారత అడ్వకేట్స్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అవగాహన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆదివారం జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత, విద్యార్థులకు రాజ్యాంగంపై సరైన అవగాహన లేదన్నారు. రాజ్యాంగంపై అవగాహన కల్పించడంతోపాటు ఉచితంగా రాజ్యాంగ ప్రతులను అందజేస్తున్నామన్నారు.

జేఏసీ కార్యాలయంలో ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు అవగాహన శిబిరాలు కొనసాగుతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో అవగాహన శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 8885670270 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

'డాక్టర్ రేష్మ ఉన్నత శిఖరాలకు ఎదగాలి'

గోల్నాక, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్స్‌లో బంగారు పతకం సాధించిన ఈఎన్‌టీ డాక్టర్ రేష్మను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో పిన్న వయస్సులో బంగారు పతకం రావడం గర్వించదగ్గ విషయమన్నారు. రేష్మ మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. రేష్మ తల్లిదండ్రులు వినోద్‌కుమార్, శారద, జైస్వాల్‌గార్డెన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్, చైర్మన్ ఎ.రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేడే వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మే 1న జరిగే మేడే వేడుకలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ విద్యానగర్‌లో మార్క్స్‌భవన్‌లో ఆదివారం జరిగింది. పోస్టర్‌ను ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షులు అరుణ, సహాయ కార్యదర్శి గీత ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మణెమ్మ, సరోజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

\- రాంనగర్, ఆంధ్రజ్యోతి

మహిళ ఆత్మహత్యాయత్నం

రాంగోపాల్ పేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. సచివాలయ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన మహిళ(33)కు వివాహమై ఎనిమిదేళ్లయినా పిల్లలు పుట్టలేదు. దీంతో అత్తింటివారు వేధిస్తుండడంతో మానసికంగా కుంగిపోయిన ఆమె ఆదివారం మధ్యాహ్నం హుస్సేన్‌సాగర్‌లో దూకింది. ఆ సమయంలో సచివాలయ గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఆమెను కాపాడారు. కుటుంబ సభ్యులను పిలిపించి వారికి, ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు.